
మంచిర్యాలలో కార్మెల్ స్కూల్లో పోలింగ్ కేంద్రం పోటాపోటీగా ప్రచారం..


హాజీపూర్ : ఓటు వేసిన కొత్త ఓటర్లు


మంచిర్యాల స్టాఫ్ ఫొటోగ్రాఫర్ : మంచిర్యాలలో పోలింగ్ ముగిసిన తరువాత ఈవీఎంలను బాక్సులో భద్రపరుస్తున్న సిబ్బంది

# మంచిర్యాల నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతం


హాజీపూర్ : ముల్కల్ల పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ సరళిని పరిశీలించి బయటకు వస్తున్న ఎమ్మెల్యే దివాకర్ రావు


జన్నారం పోలింగ్ కేందాన్ని పరిశీలించిన బీఆర్ఎస్ అభ్యర్థి భూక్యా జాన్సన్‌నాయక్

మంచిర్యాలటౌన్, నవంబర్ 30: ఓట్ల పండుగ ముగిసింది. ఆరునెలలుగా అలుపెరుగకుండా ప్రచారాల్లో పాల్గొన్న ఆయా పార్టీల నాయకులు చివరిరోజైన పోలింగ్ రోజున కూడా పోటీపోటీ ప్రచారాలను నిర్వహించారు. తమ పార్టీకే అంటే తమ పార్టీకి ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఉదయం ఏడుగంటలకు ప్రారంభమైన పోలింగ్ మొదటి గంటలో కాస్త నిదానంగా జరుగగా ఉదయం తొమ్మిది గంటల తరువాత వేగం పుంజుకుంది. మధ్యాహ్నం 12 గంటల తరువాత ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివస్తుండటంతో ఓటువేసేందుకు లైన్లు బారులు తీరాయి. గోపాల్‌వాడ, సాయికుంట, పాతమంచిర్యాల, జడ్పీ బాలికల పాఠశాల, ట్రినిటి, కార్మెల్ హైస్కూళ్ల పోలింగ్ కేంద్రాల సమీపంలో వంద మీటర్ల పరిధికి అవతల ఆయా పార్టీల నాయకుల ప్రచారం, ఓటర్ల చుట్టూ చుట్టుముట్టడం, పోటాపోటీ నినాదాలు చేయడం కొంత ఆందోళన కలిగించినా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. నియోజకవర్గం పరిధిలో ఉదయం 9గంటల వరకు 9.63 శాతం పోలింగ్ నమోదుకాగా, 11 గంటలకు 23.93 శాతం, మధ్యాహ్నం ఒంటి గంటకు 40.11 శాతం, 3 గంటల వరకు 54.36 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం ఏడు గంటలనుంచి సాయంత్రం నాలుగు గంటల వరకే పోలింగ్ సమయం కాగా నాలుగు గంటల లోపు పోలింగ్‌కేంద్రాలకు చేరుకున్న ఓటర్లందరికీ ఓటు వేసే అవకాశాన్ని కల్పించారు. ఓటరుల ఉత్సాహంగా ఓటువేసేందుకు తరలివచ్చారు. మంచిర్యాల నియోజకవర్గంలో మొత్తం 2,74,807 మంది ఓటర్లు ఉండగా అందులో 1,36,760 మంది పురుషులు, 1,38,022 మంది మహిళలు, 25మంది థర్డ్ జండర్‌లు ఉన్నారు. నియోజకవర్గం పరిధిలో మొత్తం 287 పోలింగ్ బూత్‌లను ఏర్పాటుచేయగా అందులో దండేపల్లి మండలంలో 49, లక్షెటిపేట మండలంలో 32, హాజీపూర్ మండలంలో 47, మంచిర్యాల పట్టణంలో 88, నస్పూరు పట్టణంలో 71 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. 346 మంది ప్రిసైడింగ్ అధికారులు, 346 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 692 మంది ఇతర సిబ్బందిని ఎన్నికల నిర్వహణకోసం నియమించారు. అక్కడక్కడా ఈవిఎంలు మొరాయించినా అధికారులు స్పందించి చర్యలు తీసుకున్నారు.


దండేపల్లి : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ యువనాయకులు విజిత్‌రావు

**లక్షెట్టిపేట మండలంలో..**

లక్షెట్టిపేట, నవంబర్ 29: లక్షెట్టిపేట పట్టణంతో పాటు మండలంలో మొత్తం 47పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలోని బలరావుపేటలో పోలింగ్ కేంద్రంలో సుమారు 88ఓట్లు పోల్ ఈవీఎం మొరాయించింది. సుమారు ఒక గంట సేపు ఈవీఎం మొరాయించడంతో అధికారులు వెంటనే సరిచేశారు. పట్టణంలోని బోయవాడతో పాటు ఎల్లారం గ్రామంలో పోలింగ్ విషయంలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు వాగ్వాదానికి దిగిడంతో సమాచారం అందుకున్న పోలీసులు వాళ్లను చెదరగొట్టారు. బోయవాడ. గుల్లకోట గ్రామాల్లో ఓటర్లు ఆలస్యంగా పోలింగ్ కేంద్రాలకు చేరుకోవడంతో సమయం ముగిసిన తర్వాత సుమారు రెండు గంటల వరకు పోలింగ్ యధావిధిగా జరిగింది. సాయంత్రం నాలుగు గంటల లోపు పోలింగ్ కేంద్రం గేట్ లోపలికి వచ్చిన వారిని అనుమతించారు. 42082మంది ఓటర్లకు గాను 68.2శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ రాఘవేంద్రరావు తెలిపారు.


లక్షెట్టిపేట మున్సిపాలిటీ ఊత్కూర్‌లో ఓటు వేసేందుకు క్యూలైన్‌లో నిలుచున్న జనం

**దండేపల్లి మండలంలో..**

దండేపల్లి, డిసెంబర్30: దండేపల్లి మండలంలో 5 రూట్లు, 49 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, వలంటీర్లు, సిబ్బంది వీల్ చైర్‌లపై తీసుకొచ్చి ఓటు వేయించారు. ముత్యంపేటలో ఈవీఎంలు గంటసేపు మొరాయించాయి. మామిడిపెల్లి పోలింగ్ కేంద్రాన్ని మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి సందర్శించారు. మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను యువ నాయకులు విజిత్‌రావు సందర్శించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు, పోలీసులు ఏర్పాట్లు చేశారు.

**హాజీపూర్ మండలంలో..**

హాజీపూర్, నవంబర్ 30 : హాజీపూర్ మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని నంనూర్ గ్రామ పంచాయతీలోని పోలింగ్ బూత్ 117, 124లలో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ అరగంట అలస్యంగా ప్రారంభమైంది. పోలింగ్ సమయం గడిచినా కొన్ని పోలింగ్ బూత్‌లలో ఓటు వేసేందుకు మహిళలు, పురుషులు బారులు తీరారు.

**నస్పూర్ మండలంలో..**

సీసీసీ నస్పూర్, నవంబర్ 30: నస్పూర్ మున్సిపాలిటీలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 25 వార్డుల్లో 68,608 ఓటర్లు ఉండగా, 28 పోలింగ్ కేంద్రాల్లో 71 బూత్‌లను ఏర్పాటు చేశారు. సీతారాంపల్లి, శ్రీరాంపూర్‌లలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మోరాయించాయి. దీంతో 4 గంటలకు ముగియాల్సిన పోలింగ్ క్యూలైన్‌లో ఉన్న వారికి ఓటు వేయడానికి అవకాశం కల్పించారు. నస్పూర్ మున్సిపల్ కార్యాలయంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, పల్లవి దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాలను మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి సందర్శించారు. సీసీసీ నస్పూర్ ఎస్ఐ రవికుమార్, శ్రీరాంపూర్ ఎస్ఐ రాజేశ్ బందోబస్తును నిరంతరం పర్యవేక్షించారు. పోలీసులు బందోబస్తులు నిర్వహించారు.

**జన్నారం మండలంలో..**

జన్నారం, నవంబర్ 30 : మండలంలో 54 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. రోటిగూడ, గీతానగర్, రాంపూర్, పొనకల్ గాంధీనగర్, టీజీపల్లె గ్రామాల్లో పోలింగ్ స్టేషన్లో ఈవీఎంలు మోరాయించాయి. వెంటనే అధికారులు సరి చేయించారు. ఖానాపూర్ నియోజకవర్గంలో 72.6 శాతం పోలింగ్ జరిగినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.


మంచిర్యాలలో చంటి పాపతో వచ్చిన మహిళ


శ్రీరాంపూర్‌లో ఓటు వేయడానికి పెద్ద సంఖ్యలో వేచిచూస్తున్న ఓటర్లు



ఓటు వేసిన లక్షెట్టిపేట మున్సిపల్ చైర్మన్ కాంతయ్య, డీసీఎమ్మెఎస్ చైర్మన్ లింగన్న

## తొలిసారి ఓటు వేసిన కవలలు...


ఓటు వేసిన కవల సోదరులు

మంచిర్యాలటౌన్, నవంబర్ 30: మంచిర్యాల పట్టణం గౌతమేశ్వర కాలనీలో నివసించే రాజగోపాల్‌రావు, మాధవి దంపతులకవల పిల్లలు అంజిత్, అభిజీత్‌లు తొలిసారి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు వేయడం తమకెంతో ఆనందంగా ఉందని తెలిపారు.

## భవిష్యత్‌కు మూడు తరాలు...


ఓటు వేసిన అమ్మమ్మ, అమ్మ, మనువరాలు

మంచిర్యాల అర్బన్ : ఓటు ద్వారా భవిష్యత్‌కు బాటలు వేయచ్చు. అందుకోసమే ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకొని భవిష్యత్‌ను ఎంచుకుంటారు. ఈ చిత్రంలో కనిపిస్తున్న కూతురు, అమ్మ, అమ్మమ్మలు దండేపల్లి మండలం కన్నెపల్లి గ్రామస్తులు. ఒకే కుటుంబానికి చెందిన ఈ మూడు తరాలకు వ్యక్తులు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## ఓటు హక్కును కోల్పోయిన మహిళ..

మంచిర్యాల అర్బన్, నవంబర్ 30 : జిల్లా కేంద్రానికి చెందిన శానగొండ పద్మ, కూతురు శానగొండ అనూషలకు పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలకు ఓటు వేసేందుకు వచ్చారు. శానగొండ పద్మకు (ఆర్‌యూఏ3639150) 141 బూత్‌లో 1353 సీరియల్ నెంబర్ మీద ఓటు ఉండగా, శానగొండ అనూష(ఆర్‌యూఏ3639531)కు ఇదే కేంద్రంలో 140 బూత్‌లో 1398 సీరియల్ నంబర్ మీద ఓటు కలిగి ఉన్నారు. ఇద్దరు కలిసి కేంద్రంలోకి వెళ్లగా 141 బూత్‌లో శానగొండ పద్మ వేయాల్సిన ఓటు స్లిప్పును శానగొండ అనూషకు ఇవ్వడంతో నేరుగా వెళ్లి ఓటు వినియోగించుకొని వచ్చింది. 140 బూత్‌కు శానగొండ పద్మ వెళ్లగా ఈ బూత్‌లో ఓటు లేదు, 141కు పోవాలని సూచించారు. దీంతో అసలు విషయం బయటకు వచ్చింది. పోలింగ్ కేంద్రంలో అధికారుల నిర్లక్ష్యంతో పద్మ ఓటును నష్టపోవాల్సి వచ్చింది.

## నేటి నుంచి కొత్త మద్యం పాలసీ

మంచిర్యాల అర్బన్, నవంబర్ 30 : జిల్లాలోని మద్యం దుకాణాల లైసెన్స్ గడువు గురు వారంతో ముగిసింది. డిసెంబర్ 1వ తేదీ నుంచి ఇటీవల నిర్వహించిన టెండర్లలో షాపులు దక్కించుకున్న వారు రెండేండ్ల (2023-25)పాటు మద్యం దుకాణాలను నిర్వహించనున్నారు. జిల్లాలో 73 మద్యం దుకాణాలకు గాను 51 దుకాణాలు ఓపెన్ కాగా 22(ఎస్సీ-10, ఎస్టీ-6, గౌడ్స్-6) రిజర్డ్వ్ దుకాణాలుగా కేటాయించారు. 73 దుకాణాలకు మొత్తం 2,242(398 మహిళలు, 1,844 పురుషులు) దరఖాస్తులు రాగా లక్కీ డ్రాలో 58 మంది పురుషులు, 15 మంది మహిళలు దక్కించుకున్నారు. కొత్తగా మద్యం దుకాణాలను నిర్వహించనున్నారు. మరోవైపు నవంబర్‌లో ఎన్నికలతో దుకాణాల్లోని మద్యం కోటా మొత్తం ఖాళీ అయినట్లు సమాచారం. లక్కీ డ్రాలో మద్యం దుకాణం దక్కించుకున్న పాత వారు మరమ్మతులు చేసుకుంటుండగా, డ్రా దక్కని వారు సామాన్లను తరలిస్తున్నారు.